
అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....


# వన్ నేషన్


RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 354 ఎడిటర్: కె.యువరాజ్ ఆదివారం 4-10-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు




## ఆన్‌లైన్లో చిన్నారులు ఎంత భద్రం?

**- హైకోర్టు సాయం తీసుకోవాలని సూచన- కేంద్ర న్యాయమంత్రి మేఘ్వాల్ పిలుపు - భవిష్యత్తు ఆస్తులు పిల్లలే: జస్టిస్ నరసింహా - ఆస్పత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి - వైద్య సిబ్బంది కొరత లేకుండా చూడాలి - ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం**

హైదరాబాద్, అక్టోబర్ 3 (వన్‌నేషన్): న్యాయం అంటే కేవలం నేరస్థుడికి శిక్ష పడటం కాదని, న్యాయం అంటే బాధితుడి జీవితాన్ని తిరిగి నిలబెట్టడం, గౌరవాన్ని తిరిగి ఇవ్వడమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక నేరం వల్ల బాధితుడు కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమే నిజమైన చైల్డ్ ఫ్రెండ్లీ జస్టిస్ అని చెప్పారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నాల్సా), తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం 'పిల్లల సైబర్ భద్రత' అనే అంశంపై నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల న్యాయమూర్తుల సదస్సులో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్(నాల్సా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్), జస్టిస్ పమిడిఘంటం శ్రీనర్సింహా, జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ మహాదేవన్, తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ హైకోర్టు, టీజీఎస్-ఎల్ఎస్ఏతో సంప్రదింపులు జరిపి పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం సమగ్ర చైల్డ్ ఆన్‌లైన్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేయాలని ఈ వేదిక నుంచే అధికారులను ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. న్యాయ సేవా సంస్థలు చేస్తున్న మంచి కార్యక్రమాలు రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు, 2లో



## క్వాంటం వాలీగా అమరావతి

**- ఫిబ్రవరి 3 నుంచి క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ - క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు ఎగుమతి చేస్తాం - రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లోనూ ఐటీ సిలబస్ అమలు - ఇకపై ఏటా ఇలాంటి సదస్సులు నిర్వహించుకుందాం - వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలు చేరడంలో సహకరించండి - పాన్ ఐఐటీ సమ్మిట్‌లో కోరిన సీఎం చంద్రబాబు**

అమరావతి, అక్టోబర్ 3 (వన్‌నేషన్): అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభమవుతాయని సీఎం చంద్రబాబు ప్రకటించారు. శనివారం విజయవాడ అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన పాన్ ఐఐటీ సమ్మిట్-2026కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, 'ఇప్పుడు సిలికాన్ వ్యాలీ గురించి కాదు అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటోంది. 156 క్యూబిట్ క్వాంటం సిస్టమ్ వచ్చేలోగానే ఇక్కడ క్వాంటం టెస్ట్‌బెడ్లు పని చేస్తున్నాయి. క్యూ-శివ లాంటి మినీ క్వాంటం టెస్ట్ ల్యాబ్‌లు కూడా అందుబాటులోకి వచ్చాయి. క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు ఉత్పత్తి చేసి ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటాం' అని తెలిపారు. పాన్ ఐఐటీ సమ్మిట్ ద్వారా అత్యుత్తమ మేధస్సు కలిగిన ఐఐటీయన్లతో ఎక్కువ 3లో



## వృద్ధులకూ ఉచిత బస్సు!

**- సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న రేవంత్ ప్రభుత్వం - ఏపీలో 60 ఏళ్లు దాటిన వారికి 25 శాతం రాయితీ**

హైదరాబాద్, అక్టోబర్ 3 (వన్‌నేషన్): 'మహాలక్ష్మి' పథకంతో ఇప్పటికే మహిళలకు ఉచితబస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. వృద్ధులకూ ఆ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చే యోచనలో ఉంది. దీనిపై ప్రజల నుంచి వస్తున్న అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని.. సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. గ్రామీణ ప్రాంతాల వృద్ధులు ఎక్కడికి వెళ్లాలన్నా ప్రజారవాణానే ప్రధాన ఆధారం. ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తే.. ఆర్థికంగా వెనుకబడిన వృద్ధులకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. ముఖ్యంగా పింఛన్‌దారులు, ఒంటరిగా జీవించే వృద్ధులు.. తరచూ వైద్య సేవల కోసం పల్లె నుంచి మండల, జిల్లా కేంద్రాలకు, పట్టణాలకు రాకపోకలు సాగించేవారికి ఈ సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో 60 ఏళ్లు నిండిన వృద్ధులకు ఏపీ సర్వీసులతో సహా అన్ని బస్సుల్లో టిక్కెట్ చార్జీలో 25 శాతం రాయితీ కల్పిస్తున్నారు. రాష్ట్రంలో వృద్ధులకు ఉచిత ప్రయాణం అమలు చేయాలని సర్కారు భావిస్తే.. వయో పరిమితిని ఎంతగా నిర్ణయించాలన్నది కీలకంగా మారనుంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. 60 ఏళ్లు దాటిన వారిని సీనియర్ సిటిజన్లుగా పరిగణిస్తారు. సీనియర్ సిటిజన్లకు ఉచిత బస్సు ప్రయాణం ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపితే.. వయో పరిమితి (60 ఏళ్లు దాటినవారికా? లేక 65 ఏళ్లు దాటినవారికా? అనే విషయం), పల్లె వెలుగు నుంచి ఎక్స్‌ప్రెస్ వరకు వర్తింపజేయాలా? ఇతర జిల్లాలకు ప్రయాణించినప్పుడు ఈ సౌకర్యం ఉంటుందా? తదితర అంశాలకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ 3లో

## పార్లమెంటరీ కమిటీల్లో తెలంగాణ ఎంపీలకు ప్రాధాన్యం



న్యూఢిల్లీ, అక్టోబర్ 3 (వన్‌నేషన్): పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల్లో తెలంగాణ ఎంపీలకు ప్రాధాన్యం దక్కింది. విదేశీ వ్యవహారాల కమిటీలో కె.లక్ష్మణ్, డీకే అరుణ, అసదుద్దీన్ ఒవైసీ; గృహ, పట్టణ వ్యవహారాల కమిటీలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి; వాణిజ్య వ్యవహారాల కమిటీలో రేణుకా చౌదరి; ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిటీలో బి.పార్థసారథిరెడ్డి, కడియం కావ్య; పరిశ్రమల కమిటీలో ధర్మపురి అర్వింద్, మల్లు రవి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఉన్నారు. సిబ్బంది, ప్రజాఫిర్యాదులు, చట్టం, న్యాయ కమిటీలో ఎం.రఘునందన్‌రావు; సైన్స్, టెక్నాలజీ, పర్యావరణం, వాతావరణ మార్పుల కమిటీలో గడ్డం వంశీకృష్ణ; రవాణా, పర్యాటకం, సాంస్కృతిక కమిటీలో సురేశ్‌కుమార్ షెట్కార్; రసాయనాలు, ఎరువుల కమిటీలో పోరిక బలరాం నాయక్, ఈటల రాజేందర్ సభ్యులుగా ఉన్నారు. ఇక బొగ్గు, గనులు, ఉక్కు కమిటీలో అనిల్‌కుమార్ యాదవ్; సమాచార ప్రసార, సమాచార సాంకేతిక కమిటీలో రఘురామిరెడ్డి; ఆహారం, ప్రజాపంపిణీ కమిటీలో ఆర్.కృష్ణయ్య; రక్షణ కమిటీలో దామోదర్‌రావుకు చోటు దక్కింది. ఇంధన కమిటీలో వేంనరేందర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి; సామాజిక న్యాయం, సాధికారత కమిటీలో గోడెం నగేశ్, పెట్రోలియం, సహజవాయువు కమిటీలో వద్దిరాజు రవిచంద్ర సభ్యులుగా నియమితులయ్యారు


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని



అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.

9948222240

# నల్లగుట్టలో ఉచిత వైద్య శిబిరం

**హైదరాబాద్, అక్టోబర్ 3 (వన్‌నేషన్):** పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం రాంగోపాల్ పేట్ డివిజన్ లోని నల్లగుట్ట అభివృద్ధి సంఘం హాలులో అప్పా స్వచ్ఛంద సంస్థ, జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా






ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పేద ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాలలో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలనుఏర్పాటు చేయాలని కోరారు. వైద్యం ఎంతో ఖరీదైన పరిస్థితులలో పేద ప్రజలు కూడా ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కిమ్స్ ఆస్పత్రి డాక్టర్ లు 150 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షించి, ఆరోగ్య సలహాలను, మందులు అందజేశారు. ఈ శిబిరంలో మాజీ కార్పొరేటర్ లు అత్తెల్లి అరుణ గౌడ్, అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు ఆంజనేయులు, కోటేశ్వర్ గౌడ్, సతీష్, గణేష్, జనార్ధన్, రాజు, చంద్ర ప్రకాష్, అరుణ్ భట్, సత్యనారాయణ, అభిషేక్, విఠల్, జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నర్సింహ మూర్తి, వెంకట్, అప్పా సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ ఎం. బస్వరాజ్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి. రమేష్, జి. మంజుల, సిబ్బంది, నల్లగుట్ట అభివృద్ధి సంఘం ప్రతినిధులు గున్నాల నరేష్, యశ్వంత్ రావు, సురేష్, రాజు, గంగరాజు, జనహిత క్యాంపు కో ఆర్డినేటర్ బి. నర్సింగ్ రావు, కిమ్స్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ జే.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా “ఉద్భవ్ 2026” ఫ్రెషర్స్ డే వేడుకలు

**ఎల్బీనగర్ ప్రతినిధి, వన్ నేషన్,అక్టోబర్ 03:** ఆదిత్య డిగ్రీ కళాశాల, ఎల్‌బీనగర్‌లో నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ “ఉద్భవ్ 2026” పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ఆర్. నాగేంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ అమర్‌నాథ్, సూపరింటెండెంట్ కృష్ణయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకలు విద్యార్థుల్లో ఆనందోత్సాహాలను నింపాయి. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు



నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి అకాడమిక్ డైరెక్టర్ సి. హెచ్. ఫణికుమార్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ఎం. వెంకట రెడ్డి ,ఆదిత్య డిగ్రీ కళాశాల దిల్‌సుఖ్‌నగర్ ప్రిన్సిపాల్ శ్రీమతి శైలజ హాజరై విద్యార్థులను ఆశీర్వదించి, వారి భవిష్యత్ విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే శ్రీ చంద్ర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. చారి కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు విలువైన సందేశాన్ని అందించారు. విద్యార్థులు విద్యతో పాటు ప్రతిభ, క్రమశిక్షణ, నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థులు, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం ఆద్యంతం సందడిగా సాగింది. చివరగా జనగణమన ఆలాపనతో “ఉద్భవ్ 2026” ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా ముగిశాయి.

# నాయీబ్రాహ్మణుడు పై దాడి చేసిన దోషులను వెంటనే అరెస్టు చేయాలి

## ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ జేపసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు

**కర్నూలు, అక్టోబర్ 3 (వన్‌నేషన్):** నాయీబ్రాహ్మణ సంఘీయుడైన ఎం రవిచంద్ర పై గుర్తుతెలియని వ్యక్తులు నడిరోడ్డుపై ముసుగులు వేసుకొనివచ్చి భౌతిక దాడి చేయడం అత్యంత దుర్మార్గమని ఈ దాడి హేయమైన చర్యని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు తీవ్రంగా ఖండించారు. ఉద్దేశపూర్వకంగా జరిగిన ఈ దాడి విషయంలో దోషులను వెంటనే అరెస్టు చేయాలని నాయి బ్రాహ్మణులపై ఈ విధమైన దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని నరసింహారావు విజ్ఞప్తి చేశారు. కర్నూలు జిల్లా పత్తికొండలో ఊరి నడిబొడ్డున ఉద్దేశపూర్వకంగా ముసుకులు వేసుకొని వచ్చి దాడి చేయడం పిరికిబంద చర్యని, పోలీసులు



దోషులను వెంటనే అరెస్టు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా న్యాయ పోరాటానికి సిద్ధం పడాల్సి వస్తుందని నరసింహారావు పేర్కొన్నారు. గత దశాబ్దాల కాలం నుండి నాయీబ్రాహ్మణులపై దాడులు హత్యలు అత్యాచార యత్నాలు అధికమవుతున్న దృష్ట్యా నాయీబ్రాహ్మణులకు రక్షణ చట్టం కావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ నేటికీ అమలు కాలేదని ఆవేదన చెందారు. ఈ భౌతిక దాడిని ఖండించిన వారిలో నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్నేపాటి నరేష్ గుంటూరు జిల్లా జేఏసీ అధ్యక్షులు కొండూరు అంకమ్మరావు గుంటూరు అర్బన్ కమిటీ ఆర్గనైజర్స్ కే బతేశ్వరరావు అద్దంకి రవి గంగాధర్ భాస్కర్ తదితరులు ఉన్నారు.

# జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఘనంగా ఆరుద్రాష్టమి వ్రతం

**- వ్రత క్రతువుకు హాజరైన జగ్గారెడ్డి,నిర్మలా జగ్గారెడ్డి - 2700 మంది మహిళలతో సామూహిక వ్రతం**



**సంగారెడ్డి, అక్టోబర్ 3 (వన్‌నేషన్):** సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాడిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో పీఠాధిపతి మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణ లో ఆరుద్రాష్టమి వ్రత క్రతువు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డి పాల్గొన్నారు.

అరుద్రాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు



అందజేశారు. 2700 మంది మహిళలతో సామూహిక ఆరుద్రాష్టమి వ్రతాన్ని నిర్వహించారు. నిర్మలా జగ్గారెడ్డి సైతం ఈ వ్రతం లో పాల్గొన్నారు.

కార్యక్రమంలో భాగంగా ఆరుద్రాష్టమి మహత్యం, అమ్మవారి విశిష్టత, పూజా విధానాలను నిర్వాహకులు భక్తులకు వివరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఫసల్‌వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమం లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగేరి శ్రీహరి, జ్యోతిర్వాస్తు విద్యాపీఠం నిర్వాహకులు పాల్గొన్నారు

# ఎమ్మిగనూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

**ఎమ్మిగనూరు, అక్టోబర్ 3 (వన్‌నేషన్):** ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని రైతు సంఘం నాయకులు అబ్దుల్లా డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం పార్టీ, రైతు సంఘం (ఏఐకేఎస్) ఎమ్మిగనూరు మండలంలో 25 గ్రామాలను పర్యటించారని, అందులో 17 గ్రామాలు కరువుకు గురైనయని వారు తెలియజేశారు. వర్షాలు సరైన సమయంలో కురవక ఎల్ నినో ప్రభావంతో పత్తి, వేరుశనగ, ఉల్లి, మిరప, చిరుధాన్యాల పంటలు పూర్తిగా ఎండిపోయాయని తెలియజేశారు. కర్నూలు జిల్లాలో 27 మండలాలకు గాను 15 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేవలం ఆఫీసులకే పరిమితమై కరువు నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్లకు పంపించడం వల్ల 15 మండలాలు మాత్రమే కరువు మండలంగా ప్రకటించారని, ఇది సరైన పద్ధతి కాదని విమర్శించారు. ఇప్పటికే రైతు ఒకటికి నాలుగు సార్లు వర్షం వచ్చిన ప్రతి సందర్భంగా విత్తనాలు నాటి సేద్యం చేసి ఎరువు మందులు, పురుగుమందులు, వాడి ఎకరాకు 40,000




వ్యవసాయ ఖర్చులు పెట్టుబడిగా పెట్టారని తెలియజేశారు. రైతు వ్యవసాయ ఖర్చులకు గాను ప్రైవేటు వ్యక్తుల ద్వారా నూటికి మూడు రూపాయలు వడ్డీ తెచ్చి వ్యవసాయ పెట్టుబడులు పెట్టిన విషయాన్ని ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర కూడా ప్రకటించకపోవడం రైతు ఆత్మహత్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ఎమ్మిగనూరు నియోజకవర్గం లోని ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాలను కరువు మండలంగా ప్రకటించకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ కార్యదర్శి గోవిందు, సిపిఎం నాయకులు రమేష్, సుభాన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్లో చిన్నారులు ఎంత భద్రం?

(1వ పేజీ తరువాయి)

ప్రతి గ్రామానికి చేరేలా తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. ప్రతి పిల్లవాడు, ప్రతి తల్లిదండ్రులు సైబర్ నేరాల కోసం ఉద్దేశించిన 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం ఉద్దేశించిన 1098 నంబర్లు తప్పక గుర్తుంచుకోవాలని సూచించారు. డబ్బు లేకపోవడం వల్ల ఎవరికీ న్యాయం దూరం కాకూడదని చెప్పారు.

“ఇంటర్నెట్లో తెలియక పిల్లలు చేసే చిన్న పొరపాట్లు కూడా పెద్ద సమస్యలకు దారి తీయవచ్చు. వాటి ప్రభావం కుటుంబాలపై, మొత్తం సమాజంపై కూడా పడుతుంది. భయంతో పిల్లలు తమ సమస్యలను ఎవరికీ చెప్పలేక పోవచ్చు. పిల్లలపై సైబర్ నేరాలను ఎలా అరికట్టాలి? మన పిల్లలను ఎలా సురక్షితంగా ఉంచాలి? బాధిత పిల్లలకు న్యాయం ఎలా అందించాలి? అనేవి మన ముందున్న సవాళ్లు” అన్నారు. తెలంగాణలో మహిళలు, పిల్లల రక్షణ తమ ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యతగా ఉందని చెప్పారు.

పోలీసు భరోసా కేంద్రాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయ సేవా సంస్థలు సమన్వయంతో కలిసి పని చేసినపుడే ఒక బిడ్డకు పూర్తి రక్షణ కల్పించగలుగుతామని అన్నారు. భరోసా కేంద్రాల్లో మహిళలు, పిల్లలకు ఒకే చోట పోలీసు సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామన్నారు. పిల్లల రక్షణ కోసం షీ-భరోసా సైబర్ ల్యాబ్‌లు పని చేస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు, టీచర్లకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలతో తరచుగా మాట్లాడాలని, ఇంటర్నెట్‌లో ఏం చేస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? ఏం చూస్తున్నారు? తెలుసుకోవాలని, తప్పుపట్టేలా కాకుండా ఆసక్తితో మాట్లాడాలని సూచించారు.

న్యాయం లభించడం మాత్రమే కాదు, అది సులభతరంగా అర్థమయ్యే రీతిలో ఉండాలని కేంద్ర న్యాయ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ అన్నారు. న్యాయ వ్యవస్థ సమర్థంగా ఉండటమే కాదు, సున్నితంగా కూడా ఉండాలని సూచించారు. ప్రతి చిన్నారికి చట్టపరమైన రక్షణ, సహాయంపై నమ్మకం, ఎదిగేందుకు అవకాశం దక్కాలని చెప్పారు. ఆన్‌లైన్ గ్రూమింగ్ సమస్యపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులపై నేరాల్లో తీర్పు తర్వాత కూడా కౌన్సెలింగ్, వైద్య సేవలు, చదువు కొనసాగింపు, బాధితులకు పరిహారం, సురక్షితమైన పునరావాసం కల్పించాల్సిన బాధ్యత మనపై ఉంది’ అని పేర్కొన్నారు.




**- క్రికెట్, హాకీ, ఆర్చరీ, రెజ్లింగ్, గోల్ఫ్‌లో అదుర్స్ - హాకీ జట్టుకు ఒలింపిక్ బెర్త్ - ఆర్చరీలో కుమ్‌కుమ్ జోరు - ఓవరాల్‌గా 85 పతకాలతో భారత్‌కు నాలుగోస్థానం**

నగోయా: ఆసియా క్రీడల్లో దాదాపు పోటీలన్నీ ముగిశాయి. మన అథ్లెట్లు అద్భుత ప్రదర్శన చేశారు. ఐదు స్వర్ణ పతకాలతో అదరగొట్టారు. స్టార్ ఆటగాళ్లతో కూడిన క్రికెట్, హాకీ పురుషుల జట్లు అద్భుత ఆటతో జపాన్‌లో భారత క్రీడాభిమానులను అలరించాయి.

### హాకీలో వరుసగా రెండోసారి..

మొన్న మహిళలు, ఈరోజు పురుషులు ఆసియా హాకీలో తమకు తిరుగు లేదని నిరూపించారు. పురుషుల హాకీ ఫైనల్లో హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్సీలోని భారత్ 5-1తో మలేసియాను చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకొంది. వరుసగా రెండోసారి ఆసియా క్రీడల టైటిల్‌ను పట్టేసింది. హర్మన్‌ప్రీత్ (11, 57ని.) రెండు గోల్స్‌తో సత్తా చాటగా, జుగ్‌రాజ్ సింగ్ (23ని.), హార్దిక్ సింగ్ (42ని.), షీలానంద్ లక్రా (54ని.) తలో గోల్ కొట్టారు. షెల్లో సిల్వేరియస్ మలేసియా తరఫున ఏకైక గోల్ చేశాడు. హర్మన్ ప్రీత్ మొత్తం 12 గోల్స్‌తో టోర్నీ టాపర్‌గా నిలవడం విశేషం. అలాగే వరుసగా రెండు ఆసియా క్రీడల్లో జట్టును విజేతగా నిలిపిన తొలి భారత పురుష కెప్టెన్‌గా హర్మన్ రికార్డు నెలకొల్పాడు. వెటరన్ మిడ్ ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ అత్యధికసార్లు (మూడు) ఆసియా క్రీడల్లో పాల్గొన్న ఆటగాడిగా వినుతి కెక్కాడు. ఈమూడుసార్లు భారత్ స్వర్ణం సొంతం చేసుకోవడం మన్‌ప్రీత్‌కు మరో రికార్డు. 2014, 2022 ఆసియా క్రీడల భారత జట్లలోనూ మన్‌ప్రీత్ సభ్యుడు. మనోళ్లకు ఆసియా క్రీడల్లో ఇది ఐదో బంగారు పతకం. గతంలో 1966, 1998, 2014, 2022 ఆసియాడ్‌లలోనూ టైటిల్ కైవసం చేసుకున్నారు. కాగా, భారత పురుషులు, మహిళల జట్లు ఒకే ఆసియాడ్‌లో పసిడి పతకాలు గెలుపొందడం ఇదే తొలిసారి. స్వర్ణ పతకం దరిమిలా పురుషుల జట్టుకు 2028లో లాస్‌ఏంజిల్స్‌లో జరిగే విశ్వ క్రీడల బెర్త్ కూడా లభించింది. ఇక..పాకిస్థాన్ జట్టు పురుషుల విభాగంలో కాంస్య పతకం నెగ్గింది.

### 11 ఏళ్లకే అమ్మానాన్నను కోల్పోయి..

హరియాణాలోని బిరోహార్ గ్రామానికి చెందిన అమన్ సెహ్రావత్.. లండన్ ఒలింపిక్స్‌లో సుశీల్ కుమార్ ఒలింపిక్ పతకం నెగ్గడాన్ని టీవీలో చూసి రెజ్లింగ్‌లోకి అడుగుపెట్టాడు. అమ్మానాన్న కూడా అతని ఇష్టాన్ని కాదనలేదు. పైగా తాత కూడా ప్రోత్సహించాడు. మట్టిపై సాధన మొదలుపెట్టి.. బురదపై ప్రాక్టీస్ చేసేవాడు. అనంతరం ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియంలో చేరి కుస్తీపై పట్టు సాధించాడు. కానీ, అప్పుడే అతని ఇంట్లో అనుకోని విషాదం నెలకొంది. అతని తల్లి మానసిక సమస్యలతో మరణించింది. ఇది తట్టుకోలేక అమన్ తండ్రి మరుసటి ఏడాది చనిపోయాడు. అప్పుడు అమన్ వయసు 11 ఏళ్లు. ఇలా చిన్నవయసులోనే అమ్మానాన్న లేని అనాథగా మారాడు అమన్. అప్పటికే అతనికి చెల్లి పూజ ఉంది. ఈ దశలో ఎంతో కుంగుబాటుకు గురైన అతడు.. ఓ దశలో డ్రగ్స్ తీసుకుందామన్న ఆలోచనలు కూడా చేశాడు. ఆటను పూర్తిగా పక్కనపెట్టేశాడు. ఈ పరిస్థితుల్లో అమన్‌కు పెదనాన్న, పెద్దమ్మ, తాత అండగా నిలిచారు. చనిపోయిన అమ్మానాన్నల కోసమైన కుస్తీలో ప్రతిభ చాటుకోవాలన్న వాళ్ల మాటలతో అమన్ మళ్లీ ఆటపై దృష్టి సారించాడు. కోచ్ లలిత్ కుమార్ శిక్షణలో రాటుదేలాడు. తనకంటే వయసులో పెద్దవాళ్లతో పోటీపడుతూ ఆటలో ముందుకు సాగాడు. 2018లో ప్రపంచ క్యాడెట్ చాంపియన్‌షి?పలో కాంస్యంతో వెలుగులోకి వచ్చాడు. మరుసటి ఏడాది ఆసియా క్యాడెట్ టోర్నీలో విజేతగా నిలిచాడు. ఆసియా అండర్-23 చాంపియన్‌షిప్ నెగ్గాడు. 2022లో అండర్-23 ప్రపంచ చాంపియన్‌గా నిలిచి 19 ఏళ్లకే ఈ ఘనత సాధించిన భారత రెజ్లర్‌గా రికార్డులకెక్కాడు. అక్కడినుంచి సీనియర్‌స్థాయిలో నిలకడగా సత్తాచాటుతూ 2023 ఆసియా క్రీడల్లో కాంస్యం సాధించి భవిష్యత్ భారత స్టార్‌గా నీరాజనాలందుకున్నాడు. ఇక, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన తనపై పెట్టుకున్న అంచనాలను నిలబెట్టుకున్నాడు. ఆ విశ్వ క్రీడల సందర్భంగా తాను పోటీపడే 57 కిలోల విభాగం పతకపోరుకు ముందు బరువు ఎక్కువుండడంతో పది గంటల్లో 4.5 కిలోలు తగ్గి తన సంకల్పబలాన్ని చాటుకున్నాడు.

తాజాగా ఆసియా క్రీడల్లో తన పతక ప్రదర్శనను కాంస్యం నుంచి స్వర్ణానికి మెరుగుపరచుకొని కుస్తీలో తనకు తిరుగులేదని చాటుకున్నాడు. ఇలా వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నా, పట్టుదలగా శ్రమించి కెరీర్‌లో విజయవంతమైన క్రీడాకారునిగా నిలిచిన అమన్ క్రీడా ప్రయాణం.. ఎంతో స్ఫూర్తిదాయకం.

## వృద్ధులకూ ఉచిత బస్సు!

చేయాల్సి ఉంటుంది.

### ఆర్టీసీపై అదనపు భారం..

మహాలక్ష్మి పథకంతో టీజీఏ?సఆర్టీసీపై ఇప్పటికే ఆర్థిక భారం పడుతోంది. ఈ నేపథ్యంలో వృద్ధులకు కూడా ఆ అవకాశం కల్పిస్తే సంస్థపై అదనంగా ఎంత భారం పడుతుంది? ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఎలా భర్తీ చేస్తుంది? అన్నది కీలకంగా మారింది. మహిళల ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తున్న తరహాలోనే సీనియర్ సిటిజన్ల ప్రయాణానికి కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సి ఉంటుంది.

## క్వాంటం వ్యాలీగా అమరావతి

(1వ పేజీ తరువాయి)

సమయం గడపటం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలను చేరుకోవడంలో సహకరించాలని వారిని కోరారు. అంతర్జాతీయ టెక్ కంపెనీలకు భారతీయులే నేతృత్వం వహిస్తున్నారని, నాడు ఐటీని ప్రోత్సహించినందుకే ప్రపంచవ్యాప్తంగా ఐటీ నిపుణులుగా మన తెలుగువారు ఉన్నారని సీఎం తెలిపారు.

## రైతులు కరువు కోరల్లో చిక్కుకుని అప్పుల పాలై, ఆత్మహత్యలు కనిపించవా



ఎమ్మిగనూరు, అక్టోబర్ 3 (వన్‌నేషన్): ఎమ్మిగనూరు నియోజకవర్గంలో కరువు రాక్షసి కనిపించలేదా చంద్రబాబు గారు శాస్త్రీయ పద్ధతిలో కరువు మండలాలుగా ప్రకటించారా,ఆ శాస్త్రీయ పద్ధతిలో కరువు మండలాలను ప్రకటించారా చంద్రబాబు గారు. నియోజకవర్గంలోని రైతులు కరువు కోరల్లో చిక్కుకుని అప్పుల పాలై, ఆత్మహత్యలు కనిపించవా బాబుగారు. నియోజకవర్గంలోని గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ కార్యాలయంలో ముఖ్యుల సమావేశం నిర్వహించడం జరిగింది.

## స్మిత్ మచ్చర్ ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని పూజా అర్చన



కవాడిగూడ, అక్టోబర్ 3 (వన్‌నేషన్): దుబాయ్ నుండి ఇజ్రాయెల్ టెల్ అవీస్ వెళ్తున్న విమానంలో కో-పైలెట్ దాడి జరిపి విమానం కూల్చివేతకు పన్నిన కుట్రను ఎంతో సమయస్ఫూర్తితో ఎదుర్కొని 170 కి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడడానికి, తన పై భౌతిక దాడి జరుగుతున్నా తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఎంతో నిబ్బరంగా హనుమాన్ చాలీసాను పఠిస్తూ కాక్ పిట్ తలుపు తెరిచి మిగతా ప్రయాణీకుల స్పందనతో ఘోర ప్రమాదాన్ని తప్పించారు. ఆయన తెగువ, ధైర్యం దేశానికి గర్వకారణం ప్రపంచ దేశాలు ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టే భారతీయులు అని శ్లాఘిస్తాయి. కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని కవాడిగూడ సంకట విమోచన హనుమాన్ దేవాలయంలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ పేరు పై అర్చన, పూజలు చేయించారు.

## 12న ఖమ్మంలో వేంకటేశ్వర ఆలయం శంకుస్థాపన

### - టీటీడీ ఆధ్వర్యాన రూ.113 కోట్లతో నిర్మాణం: తుమ్మల



ఖమ్మం, అక్టోబర్ 3 (వన్‌నేషన్): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సహకారంతో అమరావతి తరహాలో రూ.113 కోట్లతో ఖమ్మం నగరంలో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఈనెల 12న శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మంలోని అల్లీపురంలో శనివారం సాయంత్రం ఆలయ నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌తో పాటు ఖమ్మంలో వేంకటేశ్వరస్వామి ఆలయాల నిర్మాణానికి టీటీడీ ముందుకొచ్చిందని, ఈ క్రమంలో ఖమ్మంలో 20ఎకరాలకు పైగా స్థలాన్ని టీటీడీకి అప్పగించామని వివరించారు. అలాగే ఖమ్మంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ ఆలయాన్ని కూడా నిర్మించబోతున్నట్లు వివరించారు.

## 'సర్'కు వ్యతిరేకంగా 6న కలెక్టరేట్ల నిర్బంధం



హైదరాబాద్, అక్టోబర్ 3 (వన్‌నేషన్): సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా ఇండియా కూటమి పార్టీలతో కలిసి ఈనెల 6న కలెక్టరేట్లను నిర్బంధిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడంతో పాటు ఆయన్ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం గాంధీ భవన్‌లో మహేశ్ గౌడ్ అధ్యక్షతన ఇండియా కూటమి పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. సీఈసీ తీరును ఇండియా కూటమి తీవ్రంగా నిరసిస్తోందన్నారు. అర్హత కలిగిన లక్షలాది మంది పౌరుల ఓట్లను ఈసీ తొలగిస్తోందని.. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. 6న జిల్లా కేంద్రాల్లో ఇండియా కూటమి పార్టీలతో కలిసి ర్యాలీలు నిర్వహిస్తామని, అనంతరం కలెక్టరేట్లను నిర్బంధిస్తామని తెలిపారు. 8న కూటమి పార్టీలన్నీ కలిసి లోక్‌భవన్‌ను ముట్టడిస్తాయని, నవంబరు 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడతామని వెల్లడించారు.

## వడివడిగా గౌరవెల్లి

### - ఇప్పటికే 98 శాతం పనులు పూర్తయ్యాయి - అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్




హైదరాబాద్, అక్టోబర్ 3 (వన్‌నేషన్): పర్యావరణ అనుమతులు సాధించి, గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో గౌరవెల్లి ప్రాజెక్టుపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, నీటిపారుదల, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి ఉత్తమ్ సమీక్ష జరిపారు. గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు 98 శాతం మేర పూర్తయ్యాయని.. భూసేకరణ, పర్యావరణ అనుమతుల విషయంలో అధికారులు సమన్వయంతో వ్యవహరించ చాలని సూచించారు. డిస్ట్రిబ్యూటరీలు, ప్రధాన కాలువలు, పిల్ల కాలువల పనులు పూర్తి చేయాలన్నారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటివరకు రూ.1,343.59 కోట్లు ఖర్చు అయ్యాయని,దింట్లో నిర్మాణ పనులకు రూ.886.76 కోట్లు, భూసేకరణ, పునరావాసానికి రూ.456.83 కోట్లు వెచ్చించామన్నారు.

# తండ్రిగా మారిన అనుభవం అద్భుతంగా ఉంది




బాలీవుడ్ స్టార్ కపుల్ కత్రినా కైఫ్ , విక్కీ కౌశల్ గతేడాది నవంబరులో మగబిడ్డకు (విహాన్) జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. తండ్రిగా మారిన తర్వాత తన జీవితంలో వచ్చిన మార్పుల గురించి విక్కీ కౌశల్ తాజాగా వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. కొడుకుతో కత్రినా గడుపుతున్న క్షణాలను చూస్తుంటే తన జీవితం పరిపూర్ణమైనట్లుగా ఎంతో సంతృప్తిగా అనిపిస్తోందన్నారు. "తండ్రి అయ్యాక జీవితంలో వచ్చిన మార్పు లను మాటల్లో వివరించలేను. అదొక అద్భుతమైన అనుభూతి. బిడ్డ తొలి ఏడుపు, బోసి నవ్వులు, కొత్త హావ భావాలు.. ఇలా ప్రతి చిన్న విషయ మూ అద్భుతంగా అనిపిస్తోంది. మని షికి ఎప్పటికీ సంతృప్తి ఉండదం టా రు. కానీ, గత పది నెలలుగా నేను పొందుతున్న ఆనందాన్ని చూస్తే.. జీవితానికి ఇది చాలనిపిస్తోంది. బిడ్డతో కత్రినా పంచుకుంటున్న సంతోషాన్ని చూసినప్పుడు.. ఆ అందమైన క్షణాలు అలాగే ఉండిపోతే బాగుంటుందనిపిస్తోంది" అని విక్కీ చెప్పకొచ్చారు. "తండ్రి అయ్యాక నాలో సున్నితత్వం, బాధ్యత మరింత పెరిగాయి. పిల్లలు ఇంట్లో వాళ్లని చూసే అన్నీ నేర్చుకుంటారు. అందుకే గత పది నెలలుగా నా ప్రవర్తనను ఎప్ప టికప్పుడు గమనించుకుంటూ మార్చు కుంటున్నా. పిల్లలకు ఆదర్శంగా ఉం డా లంటే.. ముందు మనం సరిగ్గా నడుచుకోవాలి. ఈ ప్రయాణంలో నేను నేర్చుకున్న అతిపెద్ద పాఠం ఇదే" అని ఆయన వివరించారు.

ఇక, ఇటీవల ముకేశ్ అంబానీ ఇంట జరిగిన గణేశ్ వేడుకల్లో కత్రినా కైఫ్ పాల్గొన్న విషయం తెలిసిందే. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత బరువు పెరగడంతో కొందరు నెటిజన్లు ఆమెను ట్రోల్ చేశారు. దీనిపై విక్కీ దంపతులు మౌనంగా ఉన్నప్పటికీ.. స్టార్ హీరో సల్మాన్ ఖాన్ 'బిగ్ బాస్' వేదికగా ట్రోలర్స్‌కు గట్టి కౌంటర్ ఇచ్చారు. "బిడ్డకు జన్మనిచ్చిన ఓ తల్లిని ట్రోల్ చేయడం ఏంటి? ప్రెగ్నెన్సీ తర్వాత బరువు పెరగడం సహజం. కత్రినా ప్రస్తు తం తన కుటుంబంతో సమయం గడుపుతోంది. మళ్లీ షూటింగ్స్‌లో పాల్గొనే సమయానికి ఆమె కచ్చితంగా తిరిగి ఫిట్‌నెస్ సాధిస్తుంది" అని సల్మాన్ పేర్కొన్నారు.

# 'శక్తి శాలిని' రాక ఆలస్యమేనా?



'సైయారా'తో యువతను విశేషంగా ఆకట్టుకొని తొలి అడుగులోనే మంచి క్రేజ్ సంపాదించుకున్నారు బాలీవుడ్ యువ కథానాయిక అనీత్ పడ్డా. ప్రస్తుతం ఎదురొచ్చిన అవకాశాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే పనిలో ఉన్న ఈమె.. 'శక్తి శాలిని' అనే చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. బెంగాలీ జానపద కథల నేపథ్యంలో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు ఇప్పటికే వెల్లడించింది చిత్రబృందం. కానీ దీని రాకకు ఆలస్యం కానున్నట్లు సమాచారం. కొన్ని కారణాల వల్ల ఈ చిత్రాన్ని 2027లో విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. మడాక్ ఫిల్మ్ హారర్ యూనివర్స్ నుంచి వస్తోన్న ఈ హారర్ కామెడీ చిత్రంలో విశాల్ జెత్వా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో అనీత్.. ద్విపాత్రాభినయం చేయనున్నట్లు తెలుస్తోంది.



# సినిమాలే తక్కువ.. ఇక అంత రెమ్యునరేషన్ ఎలా?: శ్రీనిధి శెట్టి

వెంకటేశ్‌కు జోడీగా స్వర్ణగా నవ్వులు పంచడానికి సిద్ధమయ్యారు నటి శ్రీనిధి శెట్టి. త్రివిక్రమ్ దర్శకత్వంలో రానున్న 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం.47' లో వీరిద్దరూ భార్యభర్తలుగా కనిపించనున్నారు. అక్టోబర్ 9న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో.. ఓ ఇంటర్వ్యూలో శ్రీనిధి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

"వెంకటేశ్ చాలా సరదాగా ఉంటారు. అన్నీ సమయానికి జరగాలని కోరుకుంటారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. సింగిల్ టేక్‌లోనే డైలాగ్ చెప్పేస్తారు. ఈ సినిమాకు నేనే డబ్బింగ్ చెప్పాను. ప్రతి పదాన్ని రాసుకొని ప్రాక్టీస్ చేశాను. నేను మొదట్లో సాఫ్ట్‌వేర్ జాబ్ చేసి నటనపై ఆసక్తితో ఇండస్ట్రీలోకి వచ్చాను. ఇష్టంతో పరిశ్రమకు వచ్చినప్పుడు.. కష్టాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. తల్లి పాత్రలో నటించడం వల్ల నా కెరీర్‌పై ప్రభావం పడుతుందని అనుకోను. కథ బాగుంటే ఏ పాత్ర అయినా అంగీకరిస్తాను. 'ఆదర్శ కుటుంబం' చూశాక.. నేను ఈ పాత్రలో ఎందుకు నటించానో మీకే అర్థమవుతుంది. 15 ఏళ్ల తర్వాత నేను నటించిన సినిమాలు చూసినప్పుడు గర్వంగా ఉండాలి. నేను చాలా ఎక్కువ రెమ్యునరేషన్ తీసుకుంటానని చాలా రూమర్స్ వచ్చాయి. అంత పారితోషికం తీసుకునేంత సినిమాలు నేనేం చేయలేదు. 10 రెట్లు ఎక్కువ తీసుకున్నట్లు వచ్చిన రూమర్స్ చూసి నవ్వుకున్నాను" అని శ్రీనిధి చెప్పారు.

# మోహన్‌లాల్‌తో .... నటించడం అదృష్టం!



కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ.. తనదైన నటనతో దక్షిణాదిలో మంచి క్రేజ్‌ను సంపాదించుకున్నారు కథానాయిక భాగ్యశ్రీ బోర్సే. ఈ మధ్యే 'లెనిన్'తో తెరపై మెరిసిన ఈ తార.. 'ఆపరేషన్ గంగా'తో తొలిసారి మలయాళ ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. అగ్రహీరో మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో విష్ణు మోహన్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఇందులో కథానాయికగా నటిస్తున్నారు భాగ్యశ్రీ. ఈ నేపథ్యంలోనే లాల్‌తో కలిసున్న ఓ ఫొటోను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంటూ.. ఓ పోస్ట్ పెట్టారామె. "ప్రియమైన మోహన్‌లాల్.. మీతో కలిసి నటించడం అదృష్టంలా అనిపిస్తోంది. ఈ ప్రయాణంలో మీ నుంచి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుంటున్నా" అని ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం నేపథ్యంలో భారత ప్రభుత్వం చేపట్టిన మిషన్ ఆధారంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది.

# టెస్ట్ కల తీరకుండానే.. రెడ్‌బాల్ క్రికెట్‌కు చాహల్ గుడ్‌బై



టీమ్‌ఇండియా జాతీయ జట్టులో మళ్లీ చోటు దక్కించుకోవడం కోసం సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తోన్న లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. రెడ్-బాల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ మేరకు ఇన్‌స్టాలో భావోద్వేగభరిత పోస్ట్ పెట్టాడు. భారత్ తరఫున టెస్టుల్లో ఆడాలన్న తన కల నెరవేరకుండానే.. అతడు ఈ రిటైర్మెంట్ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

"నేను మొదటిసారి ఎర్ర బంతిని ఎదుర్కొన్నప్పుడు నా వయసు పదేళ్లు. ఈ గేమ్‌తో ఇంతలా ప్రేమలో పడతానని అప్పుడు కనీసం ఊహించలేదు. రెడ్ బాల్ క్రికెట్ అంటే కేవలం ఒక ఫార్మాట్ మాత్రమే కాదు.. గంటల తరబడి సహనంతో ఉండటం, పరిపూర్ణమైన వ్యక్తిగా ఎదగడానికి అర్థమేంటో నేను ఈ ఫార్మాట్‌లోనే నేర్చుకున్నా. ఇక్కడ ప్రతి పరుగు కోసం చేసే పోరాటం ఎంతో ఆనందాన్నిచ్చింది. చివరిసారిగా నేను లార్డ్‌స్‌లో ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాను. టెస్టు క్యాప్ ధరించడం నా కల. దాని కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూశా. అది నెరవేరలేదు. కానీ, ఈ ఫార్మాట్‌లో వచ్చిన ప్రతి అవకాశాన్ని నేను సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నించా. ఈ ఎర్రబంతి నాకు ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలను మిగిల్చింది" అని చాహల్ రాసుకొచ్చాడు.

"దేశం కోసం ఆడాలన్న నా తపన ఇంకా సజీవంగానే ఉంది. వన్డేలు, టీ20 ఫార్మాట్‌లో అవకాశం కోసం అన్ని శాయశక్తులా ప్రయత్నిస్తా" అని చాహల్ వెల్లడించాడు. 2009లో చాహల్ హరియాణా తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. ఈ ఫార్మాట్‌లో 49 మ్యాచ్‌లు ఆడి.. 148 వికెట్లు తీశాడు. తన 17 ఏళ్ల కెరీర్‌లో 72 వన్డేలు, 80 టీ20లకు ప్రాతినిధ్యం వహించిన ఈ లెగ్ స్పిన్నర్‌కు ఇప్పటివరకు టెస్టుల్లో ఆడే అవకాశం లేదు. అంతేకాదు.. ఫిట్‌నెస్, ఇతరత్రా కారణాలతో జాతీయ జట్టుకు దూరమయ్యాడు. చివరిసారిగా 2023లో వెస్టిండీస్‌తో జరిగిన అంతర్జాతీయ టీ20 సిరీస్‌లో కన్పించాడు.

# ఆసియా క్రీడలు.. భారత్ పసిడి 'పట్టు'.. గోల్డెన్ 'పంచ్'




ఆసియా క్రీడల్లో పదమూడో రోజు భారత్‌కు పసడి పతకాల పంట పండింది. బాక్సర్లు, రెజ్లర్లు అదరగొట్టడంతో ఇవాళ నాలుగు గోల్డ్ మెడల్స్ భారత్ సొంతమయ్యాయి. ఆర్చరీలోనూ ఓ బంగారు పతకం వచ్చింది. దీంతో పతకాల పట్టికలో భారత్ ఐదో స్థానానికి చేరుకుంది. తొలుత లవ్లీనా మొదలు పెట్టగా.. తాజాగా పర్వీన్, సుజీత్, అంకుష్ సత్తా చాటారు. కేవలం అర గంట వ్యవధిలో భారత్ మూడు స్వర్ణాలను నెగ్గింది. ప్రస్తుతం భారత్ ఖాతాలో 75 పతకాలు ఉండగా.. వీటిలో 15 స్వర్ణాలు, 25 రజతాలు, 35 కాంస్యాలు ఉన్నాయి.

**తొలుత లవ్లీనా.. ఆ తర్వాత పర్వీన్**

భారత మహిళా బాక్సర్లు లవ్లీనా, పర్వీన్ హుడా బంగారు పతకాలు గెలిచారు. తొలుత 75 కేజీల విభాగంలో చైనాకు చెందిన బావో జియిని లవ్లీనా ఓడించింది. దీంతో ఆసియా క్రీడల్లోబాక్సింగ్ విభాగంలో స్వర్ణం సాధించిన రెండో భారత మహిళా బాక్సర్‌గా నిలిచింది. తర్వాత 65 కేజీల విభాగంలో పర్వీన్ చైనీస్ తైపీ బాక్సర్ నీన్ చిన్ చెన్‌ను 3-2 తేడాతో ఓడించింది. పురుష బాక్సర్ అంకుష్ 80 కేజీల విభాగంలో అదరగొట్టాడు. ఫైనల్‌లో 4-0 తేడాతో తన ప్రత్యర్థి దక్షిణ కొరియాకు చెందిన కిమ్ మిన్‌సూయింగ్‌పై విజయం సాధించాడు.

**రెజ్లింగ్‌లో సూపర్ పట్టు..**

రెజ్లర్ సుజీత్ సూపర్ పట్టుతో బంగారు పతకం సొంతం చేసుకున్నాడు. ఆరంభంలో ఒలింపిక్ ఛాంపియన్, తజకిస్థాన్‌కు చెందిన కుదీవ్ పైచేయి సాధించాడు. ఆ తర్వాత సుజీత్ పుంజుకొని.. తజికిస్థాన్ రెజ్లర్‌ను దెబ్బ కొట్టాడు. చివరికి 10-9 తేడాతో సుజీత్ పైచేయి సాధించి స్వర్ణం గెలిచాడు.

**సెపక్‌తక్రాలో కాంస్యం..**

భారత సెపక్‌తక్రా జట్టుకు కాంస్య పతకం వచ్చింది. సెమీస్‌లో భారత్‌పై జపాన్ విజయం సాధించింది. దీంతో ఆ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌కే పరిమితమైన భారత్ కాంస్యంతో సరిపెట్టుకుంది. ఇవాళ మహిళా హాకీ ఫైనల్ జరగనుంది. షెడ్యూల్ ప్రకారం 3.30 గంటలకు మొదలవ్వాలి. కానీ, జట్టు వచ్చే దారిలో రోడ్డు ప్రమాదం కారణంగా.. 45 నిమిషాల ఆలస్యంగా ప్రారంభం కానుంది.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**